క్లుప్తంగా

గోవుల సంరక్షణకు విరాళం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు శనివారం మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన దేవరపల్లి నారపరెడ్డి, విజయకుమారి రూ.18,500 విరాళంగా ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

సచివాలయానికి కార్యదర్శి నియామకం

మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయ కార్యదర్శిగా మండలంలోని షేర్ మహ్మద్‌పేట గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావును ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ ఆదేశాలిచ్చారు. శనివారం సచివాలయానికి కార్యదర్శి లేక ఇబ్బందులు అనే కథనాన్ని సాక్షి ప్రచురించింది. దీంతో స్పందించిన ఆయన ఇన్‌చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా సర్పంచ్ అనారోగ్యంతో మృతి చెందటంతో ఉప సర్పంచ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించే విషయంలో ఉన్నతాధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పింగళి వెంకయ్యకు నివాళి



గండ్రాయి(జగ్గయ్యపేట):జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య దేశానికి అందించిన సేవలను వివరించారు. అంతే కాకుండా దేశ జాతీయ పతాకాన్ని రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌బాబు, సుబ్బారావు, దేవదానం, పద్మావతి, వెంకట్రావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సగానికి చెట్టు కొమ్మలు



ముండ్లపాడు క్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు): మండల పరిధిలోని ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ నుంచి పెనుగంచిప్రోలు వచ్చే దారిలో రోడ్డు పక్కన చెట్టు కొమ్మలు రోడ్డు సగానికి వచ్చాయి. అలాగే రోడ్డుపై కూడా చెత్త, చెట్ల పూలు, ఆకులు సగానికి వచ్చాయి. నిత్యం పెనుగంచిప్రోలు తిరుపతమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ రహదారి గుండానే ప్రయాణిస్తారు. తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కొమ్మలు, చెత్త తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నందిగామ రూరల్:మద్యపానం, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ రమాదేవి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ముఖ్యంగా మద్యం, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని బాధ్యతాయుతమైన జీవనం సాగించాలని చెప్పారు. అంతే కాకుండా మాదకద్రవ్యాలు తీసుకోవటం వల్ల అనారోగ్య సమస్యలు సైతం ఉత్పన్నమవుతాయని తెలిపారు. అనంతరం ప్రధాన వీధుల్లో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, ఈగల్ క్లబ్ ఇన్‌చార్జ్ సుందరరావు, వీరభద్రరావు, శ్రీధర్, ఇందిరా, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



బలుసుపాడులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న తన్నీరు



కాండ్రపాడులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగ్గయ్యపేట: చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో అనేక అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తల్లికి వందనమంటూ కొంత మందికి మాత్రమే కూటమి ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. మిగిలిన వారికి పంగనామాలు పెట్టిందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెలా రూ. 1500 ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఇవ్వలేమని చేతులెత్తాశారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు 13 నెలల పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాష్, రాష్ట్ర సంయుక్త కార్యదరి మండవ శ్రీనివాసగౌడ్, జిల్లా కార్యదర్శి నరసింహారావు, పార్టీ సీనియర్ నాయకులు మట్టా ప్రతాప్‌రెడ్డి, యువజన నాయకులు బండి రంజిత్‌కుమార్, శీలం ప్రభాకర్, కంబాల మల్లయ్య, వేముల వెంకటేశ్వర్లు, గోపి, పార్థసారధి, భద్రయ్య, మీగడ వెంకటేశ్వర్లు, ఏడు కొండలు, దారావత్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయటం పరిపాటిగా మారింది..

నందిగామ రూరల్:ఎన్నికలకు ముందు హామీలివ్వటం అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించటం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మునగచర్ల, అడవిరావులపాడు గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన అసత్య హామీలను నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పథకాలలో తల్లికి వందనం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పిన చంద్రబాబు సగం మందికి పంగ నామం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పథకంలో సైతం దశల వారీగా అంటూ రైతులను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రైతులు, విద్యార్థులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. అంతే కాకుండా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుంటే ఎంత మేర లబ్ధి చేకూరేదో వివరించాలని చెప్పారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పత్రికలను ఆవిష్కరించారు. మునగచర్ల గ్రామ కన్వీనర్‌గా చిరుమామిళ్ల కిరణ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, పార్టీ రైతు కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నాయకులు పెసరమల్లి స్టాలిన్, గాడిపర్తి రామకృష్ణ, సూరా కొండ, తాళ్లూరి భద్రయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అడవిరావులపాడులో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



మునగచర్ల గ్రామ కన్వీనర్ చిరుమామిళ్ల కిరణ్‌ను సత్కరిస్తున్న నాయకులు

చందర్లపాడు(నందిగామ టౌన్):చంద్రబాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని మరోసారి నిరూపించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కాండ్రపాడు, కోనాయపాలెం గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. కానీ చంద్రబాబు మాత్రం ఎప్పటి మాదిరిగానే నమ్మితే మోసమే అని నిరూపించారని గుర్తు చేశారు. ఒక్క పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో కూటమి ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 13 నెలలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రాజ్యాంగ పరమైన పాలన సాగుతుంటే రాష్ట్రంలో మాత్రం రెడ్ బుక్ పాలన సాగుతుందని దుయ్యబట్టారు. కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, ఏడాది కాలంగా సాగిస్తున్న అరాచక పాలనను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం కాండ్రపాడు గ్రామ కన్వీనర్‌గా కమతం మదుసూధన్ రెడ్డి, కోనాయపాలెం గ్రామ కన్వీనర్‌గా బుగ్గినేని సురేష్‌లను నియమించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండా కృష్ణారెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, కమతం వెంకట నర్సిరెడ్డి, మార్కపూడి ప్రసాద్, గుడేటి శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి గుడిమెట్ల, లక్ష్మీపురం గ్రామాలలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ కన్వీనర్‌లుగా చెన్నవరపు సుబ్బారావు, ఆగోళ్ల శ్రీనివాసరావును నియమించినట్లు చెప్పారు.

కూటమిది కక్షపూరిత పాలన



మాట్లాడుతున్న గాంధీ, పక్కన జెడ్పీటీసీ సభ్యురాలు నాగమణి తదితరులు

శనగపాడు(పెనుగంచిప్రోలు): ప్రజా సంక్షేమం గాలికొదిలేసి కూటమి ప్రభుత్వం కక్షపూరిత పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ అన్నారు. మండలంలోని శనగపాడు గ్రామంలో శనివారం మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14 నెలల కూటమి పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ పోరాటాల వలనే ఒకటి రెండు పథకాలైనా ప్రజలకు వచ్చాయన్నారు. ఇచ్చిన పథకాల్లో కూడా అంతా కోతలు కోస్తూ తప్పించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎక్కడ చూసినా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు పెడుతూ పాలన గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అలవికాని హామీలిచ్చి నేడు వాటిని విస్మరించి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని చెప్పారు. ప్రతి వర్గానికి మేలు జరిగేలా పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అంతా దోచుకోవటమే ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కీసర లోకేశ్వరరావు, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మెండెం రామారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బలంత రాజారత్నం, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పూట్ల నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, గ్రామ నాయకులు కీసర చినబాబు, షేక్ దూద్‌బీ, బలంత మధు, తేజ, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

4 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన ట్రక్కు ఆటో

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో అక్రమంగా రెండు ట్రక్కు ఆటోల్లో తరలిస్తున్న నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారు జామున పోలీసులు పట్టుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. కొండపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావుకు అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న రెండు ట్రక్కు ఆటోలు కంటపడ్డాయి. వాహనాలు ఆపి రికార్డులు తనిఖీ చేయగా బియ్యానికి సంబంధించిన రికార్డులను వారు చూపకపోవడంతో రెండు ట్రక్కు ఆటోలను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం బస్తాలతోనే కొన్నింటిని నేరుగా తరలించడం గమనార్హం. వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సు సర్వీసులు

విజయవాడ ఆర్టీసీ ఈడీ విజయానంద్



ఇంద్ర బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పాల్గొన్న ఈడీ, ఆర్ఎం

తిరువూరు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల అవసరాల మేరకు బస్సు సర్వీసులు నడుపుతోందని విజయవాడ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయానంద్ అన్నారు. తిరువూరు డిపోకు కేటాయించిన ఇంద్ర ఏసీ బస్సులను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. విజయానంద్ మాట్లాడుతూ తిరువూరు డిపో నుంచి దూరప్రాంత సర్వీసులు ప్రారంభించాలని పలు విజ్ఞప్తులు వస్తున్నాయని, ఆక్యుపెన్సీ రేషియో ప్రామాణికంగా ఈ సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సిబ్బందికి ఈ మేరకు మార్గదర్శకాలు జారీచేస్తున్నామని చెప్పారు. విజయవాడ రీజినల్ మేనేజరు ఎంవై దానం తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



తల్లిపాల గురించి అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సరళ, వైస్ చైర్మన్ హఫీజున్నీసా

నందిగామ రూరల్:తల్లిపాలు శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలను అందిస్తాయని సీడీపీవో లక్ష్మీభార్గవి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోగా ముర్రుపాలు తాగించాలని సూచించారు. బిడ్డకు తల్లిపాలు పట్టటం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుందని చెప్పారు. అంతే కాకుండా శిశువు బరువును నియంత్రించటంలో సహాయపడుతుందని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు పట్టటం వల్ల తల్లికి ఒత్తిడి తగ్గటంతో పాటు మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి బాలింత విధిగా బిడ్డకు తల్లిపాలు పట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, తారాభి, కరుణకుమారి, అంగనవాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

తల్లిపాదు బిడ్డకు శ్రేష్ఠమైనవి..

వీరులపాడు:తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సెక్టార్ అధికారి ప్రభావతి తెలిపారు. మండలంలోని జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో బిడ్డకి అవసరమైన అన్ని రకాల పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. తల్లిపాలు పట్టటం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్:తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్ట్ సీడీపీవో సరళ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక చెరువుబజారు, రామాలయం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సరళ మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించడం వలన ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టాలని, ఏ విధమైన ఇతర పాలు ఇవ్వకూడదని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్ పాల్గొని గర్భిణులు తీసుకోవాల్సిన బలమైన ఆహారం గురించి వివరించారు. టాటా ట్రస్ట్ ప్రతినిధి మాధురి పిల్లల బరువు పెరుగుట గురించి తెలిపారు. సూపర్‌వైజర్ సువర్ల, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సీతామహలక్ష్మి, ఎం.వెంకటరమణ, మేరి, కె.శ్రీదేవి, బి.లత, షేక్ జహేదబేగం, వి.సుజాత, ఆయాలు పాల్గొన్నారు.

రేపటి నుంచి మిక్ కాలేజీలో శిక్షణ శిబిరాలు

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఐటీ విభాగం నిర్వహించు రైజ్ ఇన్ బ్లాక్ చైన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రాక్టికల్ బూట్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఐటీ విభాగాధిపతి ఎం.అనురాధ శనివారం తెలిపారు. దక్షిణ ఇండియాలో తొలిసారిగా ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆసక్తికరమైన బ్లాక్ చైన్ ప్లాట్‌ఫారంలో ఒకటన్నారు. బ్లాక్ చైన్ రంగంలో కెరీర్‌ను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిక్షణ శిబిరాన్ని రైజ్ ఇన్ టెక్నికల్ సంస్థ రిసోర్స్ పర్సన్ బ్లాక్ చైన్ నిపుణుడు భూపేంద్ర చౌహాన్ నేతృత్వం వహిస్తున్నాడని అన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందర్లపాడు(నందిగామ రూరల్):శీతల పానియంలో పురుగుల మందు కలుపుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన చందర్లపాడు మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు... చందర్లపాడు మండలం వెలది కొత్తపాలెం గ్రామానికి చెందిన కొత్త తిరుపతి రావు (41) శుక్రవారం పురుగు మందు తాగటంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక స్థితిగతులే ఆత్మహత్యకు కారణమని సమాచారం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వర రావు తెలిపారు.

రైతులకు నమూనా చెక్కు అందజేత



నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం తదితరులు



కంచికచర్లలో అన్నదాత సుఖీభవ నమూనా చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

జగ్గయ్యపేట అర్బన్:అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్-5 కార్యక్రమం పట్టణంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథులుగా పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ నాయకులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కట్టా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో....

కంచికచర్ల: అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక ఆఫీసర్స్ (ఓసీ) క్లబ్‌లో శనివారం రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద నియోజకవర్గంలోని 30,216 మంది రైతులకు ఆర్థిక సహాయం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు ఇవ్వాలి



ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కంచికచర్ల: భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకుని లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారని ప్రభుత్వం వారికి రక్షణ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.హరికృష్ణారెడ్డి అన్నారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డు అమలుచేయాలని ఈ నెల 19న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సంక్షేమ బోర్డు నుంచి దేశంలో భవన నిర్మాణ కార్మికులకు ఇతర రాష్ట్రాలలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కానీ మన రాష్ట్రంలో సంక్షేమ బోర్డు వల్ల కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ప్రమాదవశాత్తూ మృతి చెందిన భవన నిర్మాణ రంగ కార్మికుడికి సంక్షేమ బోర్డులో ఉన్నా లేకున్నా సరే తక్షణమే బోర్డు నుంచి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, సహజ మరణం పొందిన కార్మికుడికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికురాలికి ప్రసూతి అలవెన్స్ రూ.50 వేలు ఇవ్వాలని, ఉచిత వైద్య సదుపాయం ప్రభుత్వం కల్పించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన భవన నిర్మాణ రంగ కార్మికుడికి వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని కోరారు.

వాగులకు మరమ్మతులేవీ?



కూచి వాగుపై ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)



వాగు పొంగటంతో అనిగండ్లపాడు వద్ద మునిగిన పంట పొలాలు (ఫైల్)

- వరదలకు మునుగుతున్న పంట పొలాలు
- వాగుల్లో పూడిక తీయాలంటున్న అన్నదాతలు

పెనుగంచిప్రోలు:ప్రతి ఏడాది వర్షాలకు వరదలు రావటంతో వాగులు పొంగి పక్కన పంట పొలాలు మునిగిపోవటం పరిపాటి అయింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. వత్సవాయి మండలం నుంచి వేమవరం నుంచి పెనుగంచిప్రోలు మండలం మీదుగా నందిగామ మండలం పల్లగిరి వరకు సుమారు 18 కిలోమీటర్ల పరిధిలో కూచి వాగు విస్తరించి ఉంది. వాగుకు గడచిన కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవటంతో కాలువ కుంచించుకు పోయింది. వరద వస్తే వరద నీరు మొత్తం సాగు చేసిన పంట పొలాలపై ప్రవహించి పొలాలు కూడా దారుణంగా దెబ్బతింటున్నాయి.

పేరుకు పోయిన పూడిక...

పెనుగంచిప్రోలు మండల పరిధిలోని ముచ్చింతాల, అనిగండ్లపాడు వద్ద కూచివాగుపై తూములు వేసి కల్వర్టులు ఏర్పాటు చేశారు. అయితే కాలువ పూడికతో పాటు కల్వర్టుల వద్ద తూములకు రాళ్లు, మొద్దులు, మట్టి అడ్డుపడి వర్షాకాలం వరదలు వచ్చిన ప్రతిసారీ వరద నీరు పక్కన పొలాలపై ప్రవహించి రోజులు తరబడి అలానే ఉండటంతో పంటలు నాని రైతులు నష్టపోతున్నారు. అలాగే గుమ్మడిదుర్రు, లింగగూడెం వద్ద కూడా వాగులు పొంగినప్పుడల్లా రైతులకు నష్టం తప్పటం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగుల్లో పూడిక తీయాలని, కల్వర్టుల వద్ద మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సేఫ్టీ అధికారి శివారెడ్డి

ఇబ్రహీంపట్నం: స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కంచికచర్ల ఫైర్ సేఫ్టీ అధికారి శివారెడి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి అనే అంశంపై విద్యార్థులకు మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణ ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో సమయ స్ఫూర్తి ముఖ్యమన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని చెప్పారు. దగ్గరలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ కృష్ణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.